నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
1
సోమవారం | మార్చి 03, 2025 | www.navatelangana.com

కలెక్టర్‌ను కలసిన నూతన డీఐఈఓ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



ఆదిలాబాద్ ఇంటర్మీడియట్ బోర్డ్ అధికారిగా జాదవ్ గణేశ్‌కుమార్ బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే. నూతనంగా డీఐఈఓ గా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో కలెక్టర్ రాజర్షి షాను ఆదివారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం గణేశ్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు తెలిపారు. అలాగే గణేష్‌ను 711 అసోసియేషన్ సహా అధ్యక్షులు నిమ్మల ప్రేంచందర్ రెడ్డి సత్కారించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందజేత

నవతెలంగాణ-నిర్మల్‌టౌన్



టైక్వాండో జాతీయ క్రీడాకారుడు అక్షయ్ ఆదివారం నిర్మల్‌లోని ఈద్గాం ప్రభుత్వ పాఠశాల పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు, జామెట్రీ బాక్సులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఇందులో పాఠశాల హెచ్‌ఎం నీరజరాణి, జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షులు సోమేష్, ఆనందరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ విజేత ఎవరో..?

- నేడు ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు షురూ
- రాత్రి లేదంటే మరుసటి రోజు ఫలితం వెల్లడయ్యే అవకాశం
- అభ్యర్థులు.. రాజకీయ పార్టీల్లో తీవ్ర ఉత్కంఠ
- బరిలో 56మంది పట్టభద్రులు..15మంది ఉపాధ్యాయులు

ఉత్కంఠ భరితంగా సాగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో తుది అంకానికి సర్వం సిద్ధమైంది. పోలింగ్ ప్రక్రియ ముగిసిపోవడంతో అందరి దృష్టి విజేత ఎవరోననే దానిపై పడింది. పట్టభద్రులు, ఉపాధ్యాయులు వారి ఓటుతో ఎవరికి పట్టం కట్టారో మరికొన్ని గంటల్లో వెల్లడికానుంది. బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తమైన అభ్యర్థుల భవితవ్యం తేలిపోనుంది. సోమవారం ఉదయం 8గంటలకు శాసనమండలి ఓట్ల లెక్కింపు ప్రారంభం కానుండటంతో అందరి దృష్టి వీటిపైనే కేంద్రీకృతమవుతోంది. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ పట్టభద్రుల నియోజకవర్గ స్థానానికి 56మంది పోటీ పడగా.. ఉపాధ్యాయ స్థానానికి 15మంది బరిలో నిలిచారు. ఈ నియోజకవర్గం పరిధిలో 70.42శాతం పోలింగ్ నమోదు కావడంతో ఎవరికి ఆధిక్యం లభిస్తుంది..మొదటి ప్రాధాన్యత ఓట్లతోనే ఫలితం తేలుతుందా..రెండో ప్రాధాన్యత ఓట్లు అవసరమవుతాయా అనేది ఉత్కంఠకు దారితీస్తోంది. ముఖ్యంగా విజయంపై అభ్యర్థుల్లోనూ ఎవరికి వారు ధీమాతో ఉన్నా.. లోపల ఆందోళన చెందుతున్నట్లు తెలుస్తోంది. కరీంనగర్ కేంద్రంగా జరగనున్న ఈ లెక్కింపు క్రతువులో మరికొన్ని గంటల్లో ఫలితంపై ఓ స్పష్టత రానుంది.



నవతెలంగాణ-ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్ శాసనమండలి ఎన్నికల ఓట్ల లెక్కింపు మరికొన్ని గంటల్లో ప్రారంభం కానుంది. ఇప్పటికే లెక్కింపు కోసం అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తిచేయగా.. మరికొన్ని గంటల్లో విజేత ఎవరో తేలిపోనుంది. బ్యాలెట్ పత్రాలు కావడంతో లెక్కింపులో సమయం పట్టడంతో ఫలితం రావడంలో కొంత ఆలస్యమయ్యేలా కనిపిస్తోంది. ఫిబ్రవరి 27న పోలింగ్ జరగగా ఈ నియోజకవర్గం పరిధిలో పట్టభద్రులు 70.42శాతం మంది, ఉపాధ్యాయులు 91.90శాతం మంది ఓట్లు వేశారు. 15 జిల్లాలు 42శాసనసభ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్న ఈ నియోజకవర్గంలో పట్టభద్రుల స్థానంలో 56 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఈ నియోజకవర్గం పరిధిలో 3,55,159మంది ఓటర్లు ఉండగా 2,50,106మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇందులో పురుషులు 2,26,765మందికి గాను 1,62,561మంది ఓటు వేయగా మహిళలు 1,28,392మంది ఉండగా 87,544మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 70.42శాతం పోలింగ్ నమోదైంది. ఇక ఉపాధ్యాయ స్థానంలో 27,088మంది ఓటర్లు ఉండగా 24,895మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. పురుషులు 16,932మందికి గాను 15,743మంది ఓటేశారు. మహిళలు 10,156మందికి గాను 9152మంది ఓటు హక్కు వినియోగించుకోగా 91.90శాతం పోలింగ్ నమోదు కావడం విశేషం. ఇతరుల్లో ఇద్దరు ఓటర్లు ఉండగా ఒకరు మాత్రమే ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నేటి రాత్రి వరకు ఫలితం..!

ఎమ్మెల్సీ ఎన్నికల్లో గత ఎన్నికల కంటే ఈ సారి పోలింగ్‌శాతం పెరగడం ప్రాధాన్యం సంతరించుకుంది. పట్టభద్రుల స్థానంలో 2.50లక్షల మంది ఓటు హక్కు వినియోగించుకోగా ఉపాధ్యాయ స్థానంలో మరో 24వేల మంది ఓటేశారు. బ్యాలెట్ పత్రాలు కావడంతో వీటన్నింటినీ లెక్కించాల్సి ఉంటుంది. ముఖ్యంగా అభ్యర్థుల విజయంలో తొలి, రెండో ప్రాధాన్యత ఓట్లు కీలకం కానున్నట్లు తెలుస్తోంది. తొలి ప్రాధాన్యత ఓట్లతో ఫలితం తేలే అవకాశం లేకపోతే రెండో ప్రాధాన్యత ఓట్లను పరిగణనలోకి తీసుకుంటారు. ప్రాధాన్య క్రమంలో ఓట్ల లెక్కింపు ఉండటం..ఎలిమినేషన్ ప్రక్రియ సైతం ఉండటంతో పూర్తి ఫలితం రావడంలో ఆలస్యం జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా ఉపాధ్యాయ స్థానం ఓట్లు తక్కువగా ఉండటంతో తొలి ఫలితం వీరిదే తేలనుందని తెలుస్తోంది. పట్టభద్రుల స్థానంలో సోమవారం లేదంటే మంగళవారం వరకు వెళ్లే అవకాశం ఉంటుందని చెబుతున్నారు.

అభ్యర్థుల్లో ఉత్కంఠ..!

పట్టభద్రుల స్థానంలో 56మంది, ఉపాధ్యాయ స్థానంలో 15మంది అభ్యర్థులు పోటీ చేయగా ఇందులో విజేత ఎవరోనని తీవ్ర ఉత్కంఠకు దారితీస్తోంది. ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలు ఈ ఎన్నికను ప్రతిష్టాత్మకంగా తీసుకోవడం..బీఎస్పీ సైతం గట్టిపోటీనివ్వడం సర్వత్రా ఆసక్తి రేపుతోంది. వీరితో పాటు మరికొందరు అభ్యర్థులు సైతం గణనీయంగా ఓట్లు సాధించే అవకాశం ఉండటంతో పట్టభద్రులు ఎవరికి పట్టం కట్టారోననే ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. ఆయా పార్టీల తరపున పోటీ చేసిన అభ్యర్థులతో పాటు స్వతంత్రుల్లోనూ ఫలితంపై ఆందోళన ఉన్నట్లు తెలుస్తోంది. ఎవరికి వారు విజయంపై నమ్మకంతో ఉన్నా ప్రధాన పార్టీల అభ్యర్థుల మధ్య గట్టి పోటీ ఉందని పలు సర్వేలు చెబుతుండటం మరింత ఫలితంపై అందరిలో ఆసక్తి రేపుతోంది.

సంగం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంఘం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పట్టణంలోని పలు ప్రాంతాలలో వారంవారం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం పట్టణంలోని భుక్తపూర్ హైస్కూల్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా డీసీసీబీ ఉమ్మడి జిల్లా డైరెక్టర్ పురుషోత్తం యాదవ్ హాజరై ప్రారంభించారు. పేదల ఆకలి తీర్చడమే ధ్యేయంగా ప్రతివారం అన్నదానను నిర్వహిస్తున్నట్లు చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో సుధీర్ కుమార్ సంగేమ్, సలీముద్దీన్, మనోహర్ రెడ్డి, సుభాష్ పాల్గొన్నారు

దళితుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

దళితుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వాలు కృషి చేయాలని దళిత హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు ఎంబడి నరేందర్ పేర్కొన్నారు. వేములవాడలో ఈనెల 10, 11, 12, తేదీలలో నిర్వహించనున్న దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర సమావేశాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఆదివారం పట్టణంలోని సమావేశాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి పరిహార రమేష్, మేకల దయాకర్, అనిల్, భూమన్న ఉన్నారు.

జాతీయ స్టాండింగ్ కమిటీ ఫర్ ఎథిక్స్ కన్వీనర్‌గా అప్పాల చక్రధారి

నవతెలంగాణ-నిర్మల్ టౌన్




జాతీయ స్టాండింగ్ కమిటీ ఫర్ ఎథిక్స్ కన్వీనర్‌గా నిర్మల్ పట్టణానికి చెందిన ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డా.అప్పాల చక్రధారి నియమించబడ్డారు. ఈ సందర్భంగా డా.చక్రధారికి వైద్యులు, సిబ్బంది అభినందనలు తెలిపారు. అనంతరం డా.చక్రధారి మాట్లాడుతూ నేషనల్ ఐఎంఏ ప్రెసిడెంట్ డా.దిలీప్ భానుషాలి, రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై నమ్మకముంచి ఇచ్చిన పదవికి న్యాయం చేస్తానని చెప్పారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ, బీఎడ్ కోర్సు

నవతెలంగాణ-లక్షెట్టిపేట

లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎంతో ప్రతిష్టాత్మకమైన ఉపాధ్యాయ విద్యార్థి కోర్సు అందుబాటులోకి వచ్చిందని కళాశాల ప్రిన్సిపల్ మహాత్మ సంతోష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ వారు 4 సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ ద్వారా బీఏ, బీఎడ్‌లో ప్రవేశం కోసం నేషనల్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్ 2025-26 విద్యా సంవత్సరం కోసం ఆన్‌లైన్ దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు తెలిపారు. ఈ కోర్సు లక్షెట్టిపేట ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలలో అందుబాటులో కలదని, అర్హత ఆసక్తి కలిగిన విద్యార్థిని విద్యార్థులు ఫిబ్రవరి 20వ తేది నుంచి మార్చ్ 16వ తేది లోపు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

అటవీ క్షేత్రంలో పక్షుల శబ్దాలు రికార్డింగ్



నవతెలంగాణ-జన్నారం

కవ్వాల్ టైగర్ జోన్ అభయారణ్యంలో మండలంలోని అటవీశాఖ రేంజ్ పరిధిలో ఉన్న బైసన్ కుంట ప్రాంతంలో పక్షి శాస్త్రవేత్తలు, అటవీశాఖ అధికారులు పక్షుల శబ్దాలను రికార్డింగ్ చేశారు. ఆదివారం అడవిలో బైసన్ కుంట ప్రాంతంలో పర్య టించారు. ఈ సందర్భంగా ఆ ప్రాంతంలో సంచరిస్తున్న వివిధ పక్షుల శబ్దాలను ఆధునిక పరికరాల ద్వారా రికార్డు చేశారు. ఆధునిక పరికరాలు ఉపయోగించి పక్షుల శబ్దాలను రికార్డింగ్ చేయవచ్చని అటవీశాఖ అధికారులకు శాస్త్రవేత్తలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓ, ఎఫ్ఎస్ఓ, ఎఫ్‌బీఓ శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

కార్మిక వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వమే నిర్వహించాలి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కార్మిక వెల్ఫేర్ బోర్డును ప్రభుత్వమే నిర్వహించాలని, ప్రయివేటు సంస్థలకు అప్పగించే ఆలోచనను తక్షణమే విరమించుకోవాలని ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటనారాయణ డిమాండ్ చేశారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ లేబర్ ఆఫీస్ వద్ద ఈ నెల 4న నిర్వహించ తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆదివారం పట్టణంలోని శివాజీచౌక్, నేతాజీచౌక్, కలెక్టర్ చౌక్, దస్నాపూర్ చౌరస్తాలోని లేబర్ అడ్డాలలో కూలీలు, భవన నిర్మాణ కార్మికులకు ధర్నాకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేసి విస్తృత ప్రచారం చేపట్టారు. ధర్నాకు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ముఖ్యంగా అడ్వైజరి కమిటీలో కార్మిక సంఘాల ప్రతినిధులతో కమిటీ ఏర్పాటు చేయాలని, వలస కార్మికుల కోసం సరైన వసతులతో కూడిన నైట్ షెల్టర్స్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా భవన నిర్మాణ కార్మికులకు లేబర్ కార్డు కోసం కేవలం రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రమే వసూలు చేయాలని, 50 ఏండ్లు నిండినవారికి రూ.పది వేల పింఛన్ ఇవ్వాలని పేర్కొన్నారు. ప్రమాద వశాత్తు ఎవరైన మరణిస్తే రూ. పది లక్షలు, సహజ మరణానికి రూ.ఐదు లక్షలు కార్మిక కుటుంబాలకు అందజేసి ఆదుకోవాలన్నారు.

మటన్, చేప అమ్మకాలు జోరు.. చికెన్ బేజారు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



బర్డ్ ఫ్లూ సోకి కోళ్లు చనిపోతున్న నేపథ్యంలో ముందు జాగ్రత్తగా కొంతమంది ప్రజలు చికెన్ తినేయడం మానేస్తున్నారు. ఈ క్రమంలో జిల్లాలో చేపలు, మటన్ షాపుల వద్ద జనం క్యూ కడుతున్నారు. దీంతో చికెన్ వ్యాపారులు కస్టమర్లు లేక దుకాణాల్లో ఖాళీగా కూర్చుంటున్నారు. మరోవైపు చేపలు, మటన్ అమ్మకాలు జోరందుకోవడంతో ఆ షాపుల వద్ద జనం రద్దీ కన్పిస్తోంది. దీంతో అమ్మకం దారులు చేపల రేట్లు ఒక్కసారిగా పెంచి అందినకాడికి స్వాహా చేస్తున్నారని కొనుగోలుదారులు వాపోతున్నారు. గతంలో కిలో మటన్ ధర రూ.700 నుంచి 800కు విక్రయించేవారు. ప్రస్తుతం రూ.50 నుంచి రూ.100 వరకు పెంచి అమ్ముతున్నట్టుగా మాంసం ప్రియులు చెబుతున్నారు. అదే విధంగా చేపల రేట్లను కూడా పెంచి విక్రయిస్తున్నారని వాపోతున్నారు. రూ.150 నుంచి 160కు అమ్మే బొచ్చ, రవ్వ రకం చేపలను ఏకంగా రూ.200 కేజీగా అమ్ముతున్నారని, పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఈ ధరలు తీవ్ర ప్రభావం చూపుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మొత్తానికి కోడికి వచ్చిన రోగానికి మాంస ప్రియుల కొంప ముంచుతోంది. వారి జేబులకు చిల్లులు పెడుతోంది.

ముగిసిన శ్రీరాజరాజేశ్వర జాతర



నవతెలంగాణ-కుబీర్

ఐదు రోజుల నుంచి కొనసాగుతున్న శివరాత్రి వేడుకలు ఆదివారంతో ముగిసాయి. జాతర సందర్భంగా పాలు దుకాణాలు వెలిశాయి. చివరి రోజు ఆదివారం శ్రీ రాజరాజేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి డప్పు చప్పుల మధ్యన ఆలయానికి వచ్చి శ్రీరాజరాజేశ్వరునికి పూజలు చేసి కుస్తీ పోటీలను ప్రారంభించారు. ఈ కుస్తీ పోటీలో పాల్గొనేందుకు మండలంతో పాటు తనూర్, కుంటాల, బైంసా, మహారాష్ట్రలోని నాందేడ్, భోకర్, హిమాయత్ నగర్, చుట్టూ ప్రక్కల నుంచి అధిక సంఖ్యలో మల్లాయోధులు హాజర్యారు. ఈ పోటీలను తిలికించడనికి జిల్లాలోని పాలు ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ పోటీలో గెలుపొందిన మహారాష్ట్రకు చెందిన సాయినాథ్ బిద్రెలికి చెందిన మల్లాయోధుడికి మొదటి బహుమతి రూ.7వేలు నగదు, రెండో బహుమతి రూ.3500 అందజేశారు. పార్డి-బి గ్రామానికి చెందిన ఇందూర్ నర్సయ్య ఆధ్వర్యంలో ఆలయనికి వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ రవీందర్ ఆధ్వర్యంలో బందోబస్త్ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు వి.మోహన్, తూము రాజేశ్వర్, పోశెట్టి, శేరి సురేష్, గాయకవాడ్ తుకరం, కుష్టాపూర్ బాబు, మడి ప్రవీణ్ పాల్గొన్నారు.



ఇంటర్ పరీక్షలో నిమిషం నిబంధన సడలించాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇంటర్ బోర్డు పరీక్షలలో నిమిషం నిబంధన సడలించాలని మాదిగ జేఏసీ జిల్లా మల్యాల మనోజ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ భవనంలో తెలంగాణ మాదిగ జేఏసీ గిరిజన సంఘాల సమావేశం నిర్వహించారు. ఈనెల 5 నుండి జరిగే ఇంటర్ బోర్డ్ పరీక్షల్లో నిమిషం నిబంధనను సడలించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఉన్నత విద్యాశాఖ అధికారులకు విజ్ఞప్తి చేయడం జరిగిందన్నారు. గత సంవత్సరం ఈ నిమిషం నిబంధన పెట్టడం వలన కొంతమంది దూరప్రాంతాల నుండి వచ్చే విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకోలేక పరీక్ష రాయలేదని, దాని కారణంగా ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలు ఉన్నాయన్నారు. ఈ విషయమై పునరాలోచించి నిమిషం నిబంధనను సడలించి కనీసం 15 నిమిషాల సమయం వరకు పరీక్ష కేంద్రంలోనికి వెళ్లడానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ కోలాం సేవా సంఘం జిల్లా అధ్యక్షులు కడప సోనేరావు, లహుజీ శక్తి సేన జిల్లా అధ్యక్షులు గొడకే మధుకర్, సిందే సంజయ్, కానిరామ్, దేవరావు పాల్గొన్నారు.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్



జిల్లా కేంద్రంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. పట్టణంలోని భుక్తాపూర్ కాలనీలోని మహాత్మ జ్యోతిబాపూలే చౌక్ వద్ద అతివేగంగా వస్తున్న ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురికి గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 వాహన సిబ్బందికి సమాచారం అందించారు. ఘటన స్థలాన్ని చేరుకున్న వాహన ఈఎంటీ కార్తిక్ సింగ్, పైలెట్ రాములు గాయపడ్డ వారిని రిమ్స్‌కు తరలించారు. ప్రస్తుతం చికిత్స పొందుతున్నారు.

డ్రైవర్‌కు గాయాలు

పట్టణంలో ఒకేరోజు రెండు ఆటో రోడ్డు ప్రమాదాలు జరిగాయి. ఈ రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. మద్యం మత్తులో ఆటోను అతివేగంగా నడుపుతున్న క్రమంలో డ్రైవర్ అజాగ్రత్త వల్ల స్థానిక కిసాన్ చౌక్‌లోని పాత జాతీయ రహదారిపై బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 వాహన సిబ్బంది గాయపడ్డ డ్రైవర్ కు ప్రథమ చికిత్స అందించి, రిమ్స్‌కు తరలించారు.

ఇద్దరిపై చీటింగ్ కేసు నమోదు

నవతెలంగాణ-ఖానాపూర్

ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి డబ్బులు వసూలు చేసిన ఇద్దరి వ్యక్తిలపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాహుల్ గైక్వాడ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. ఖానాపూర్ పట్టణంలోని మొగలుపుర కాలనీకి చెందిన మొహమ్మద్ ఇర్షాద్, మొహమ్మద్ జియాలకు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి వారి దగ్గర రూ.3,50,000ను నిర్మల్‌కు చెందిన మిర్యాల రాజ్యలక్ష్మి, మిర్యాల శ్రీనివాస్ వసూలు చేశారని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
సోమవారం | మార్చి 03, 2025 | www.navatelangana.com

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-సిరికొండ

మండలంలోని సోంపల్లి గ్రామానికి చెందిన వాగ్మారే మాధవ్‌కు చెందిన ఇల్లు షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. నిత్యావసర సరుకులు, ఫ్రిజ్, కూలర్, టీవీతో పాటు రూ.లక్ష 30 వేల నగదు



పూర్తిగా కాలిపోయి బూడిదైపోయింది. దీంతో విషయం తెలుసుకున్న మాజీ జడ్పీటీసీ చంద్రకళ రఘురాం, బీజేపీ మండల అధ్యక్షుడు అమూల్ బాధిత కుటుంబానికి తక్షణ సాయంగా రూ.5 వేలను వారికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ డైరెక్టర్ ప్రకాష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి ఆర్థిక సాయం

నవతెలంగాణ-తాంసి

మండల కేంద్రంలోని నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు కోట్రంగి అశోక్ కిడ్నీ వ్యాధితో బాధపడుతూ చికిత్స చేసుకోవడానికి స్తోమత లేక దీనస్థితిలో ఉన్న విషయాన్ని తెలుసుకొని మండల కేంద్రానికి చెందిన గుగ్గిళ్ళ పోచ్చన్న తన వంతు సాయంగా ఆదివారం రూ.10వేలు ఆర్థిక సాయాన్ని అందించి తన ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నిరుపేద కుటుంబానికి చెందిన యువకుడు కిడ్నీ వ్యాధితో బాధపడటం చాలా బాధాకరమైన విషయం అన్నారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా చికిత్స కోసం ఆర్థిక సాయం అందించి, ఆ నిరుపేద కుటుంబానికి చెందిన యువకున్ని ఆదుకోవడం మన ధర్మం అన్నారు. ఆపదలో ఉన్న వ్యక్తిని ఆదుకోవడం మనకు మన కుటుంబానికి సంతోషాన్ని ఇస్తుందన్నారు.



పల్లెల్లో తాగునీటి గోస..

- అడుగంటుతున్న భూగర్భ జలాలు
- లీకేజీలుగా పైప్ లైన్లు
- మరమ్మత్తులకు విద్యుత్ మోటార్లు



డ్రమ్ముల్లో నీళ్లు తీసుకెళుతున్న గ్రామస్తుడు



నిరూపయోగంగా ఉన్న నీటి ట్యాంకు

పల్లెల్లోని ప్రజలు తాగు నీటికి గోస పడుతున్నారు. మిషన్ భగీరథ నీరు పూర్తిస్థాయిలో అందక పోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పైపు లీకేజీలు, ఓహెచ్ఎస్ఆర్ ట్యాంకు మరమ్మత్తులు, గ్రామంలో ఉన్న ఒకటి రెండు బోర్లు వాటి నుంచి నీరు రాక భూగర్భ జలాలు అడుగంటి పోవడం లాంటి కారణాలతో ప్రజలు తాగునీటిని దూర ప్రాంతాలకు వెళ్లి తెచ్చుకుంటున్నారు. దీంతో ప్రజలు చేను పనులను, కూలీ పనులను వదులు కొని, నీటి కోసం కష్టాలు పడుతున్నారు. ఇంతా జరుగుతున్న అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా తమ నీటి సమస్యను పరిష్కరించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని గౌరాపూర్‌లో రెండు ఓహెచ్ఎస్ఆర్ నీటి ట్యాంకులు ఉన్నాయి. అందులో ఒక ట్యాంకులో మిషన్ భగీరథ నీళ్ల వస్తున్నాయి. కాని ఇంకో నీటి ట్యాంకు మరమ్మత్తుల కారణంగా అందులో నీరు ఉండటం లేదని గ్రామానికి చెందిన గెడం నగేష్, గాయక్వాడ్ సంజీవ్ పేర్కొన్నారు. దీనికి తోడు పైప్ లైన్‌ల లీకేజీ కారణంగా అవి నీటి ట్యాంకు వరకు చేరడం లేదని అన్నారు. దీంతో గ్రామస్తులు తాగు నీటికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

తేజాపూర్‌లో నీటి ఎద్దడి..

మండలంలోని తేజాపూర్ పంచాయతీలోని సాలేగూడకు గత మూడు రోజులుగా తాగు నీరు సరఫరా కావడం లేదని గ్రామస్తుడు ప్రభు తెలిపారు. తేజాపూర్‌లో మిని మంచినీటి పథకంతో పాటు, ఓవర్ హెడ్ ట్యాంకు ఉంది. మూడు బోర్ వెల్ లు ఉన్న ప్రజల దాహార్తిని మాత్రం తీర్చడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. భూగర్భజలాలు అడుగంటుకు పోవడం వల్ల బోర్ వెల్‌లు పనిచేయడం లేదని పంచాయతీ కార్యదర్శి తెలిపారు. దీంతో గ్రామస్తులు ఇరుగు పొరుగు వారి సింగల్ ఫేజ్ మోటార్ ద్వారా తాగు నీటిని తెచ్చుకుంటున్నామని పేర్కొన్నారు. ఇప్పుడే ఇలా ఉంటే ముస్ముందు తమకు తాగునీటి ఎద్దడి ఏర్పడి, ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు.

తమకు ట్యాంకరు ద్వారా నీటిని అందించాలి

మిషన్ భగీరథ ద్వారా మూడు, నాలుగు రోజులకు నీళ్ళు వస్తోంది. అది కూడ మురుగుగా ఉండటంతో ఉపయోగించడం లేదు. పక్క ఇంటి నుంచి తాగు నీళ్ల తెచ్చుకుంటున్నాం. మూడు బోర్‌లు ఉన్న ఒక్కటి సైతం పని చేయడం లేదు. ఉన్న ఒక్క హాండ్ బోర్‌కు బిందెడు నీటి కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. గ్రామపంచాయతీ వారు ట్యాంకర్ల ద్వారా తాగునీరు అందించాలి.



- సల్లర్ నాగోరావ్, తేజాపూర్ గ్రామం

పుట్ట గొడుగుల్లా బెల్టు షాపులు..

- ఎమ్మార్పీ కంటే అధిక ధరకు అమ్మకాలు



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండలంలోని గౌరాపూర్, దేవాపూర్, ధనోర, సమక ఎక్స్ రోడ్డుతో మండల కేంద్రంలో ఇరవైకి పైగా పబ్లిక్ స్కూల్ పక్కన పుట్ట గొడుగుల్లా బెల్టు షాపులు వెలిశాయి. వీరు అక్రమ బెల్టు షాపులను ఏర్పాటు చేసి ఒక్కో మద్యం సీసాపై ఎమ్మార్పీ కంటే రూ.20 నుంచి 30 అధిక ధరలకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. దీనిని అరికట్టాల్సిన ఆ శాఖ అధికారులు నెలనెలా మామూళ్లు ముట్టడంతో అధికారులు అటువైను చూడటం లేదని పలువురు పేర్కొంటున్నారు. మద్యం వ్యాపారులు సిండికేట్‌గా మారి ఈ అక్రమ ధందకు తెరలేపుతున్నట్టు సమాచారం.

గ్రామాభివృద్ధి పేరిట అక్రమ టెండర్లు..

మద్యం వ్యాపారులు వివిధ గ్రామాల్లో గ్రామాభివృద్ధి పేరిట లక్షల్లో బినామీ టెండర్లు వేసి ఈ దందాను నడిపిస్తున్నట్టు తెలుస్తోంది. ఒక్క గౌరాపూర్ పంచాయతీలోని గ్రామాభివృద్ధి పేరిట రూ,1.65, ధనోరలో రూ.6.0 లక్షలకు టెండర్ వేసినట్లు తెలిసింది. ఈ బెల్టు షాపుల్లో అధిక ధరలకు అమ్మిన సొమ్ము కొంత కొంత వాట ఎక్సైజ్ శాఖకు నెలనెలా మామూళ్ళుగా ఇవ్వడం వల్లే వీరి దందా మూడు పువ్వులు..ఆరు కాయలుగా...వర్ధిల్లుతోంది. ఇలా అధిక ధరలకు మద్యం అమ్మడం వల్ల ఏజన్సీలోని గిరిజన యువత పెడదారిన పడుతున్నారు. పైగా ఆర్థికంగా ఎంతో నష్టపోతున్నారు.

పేసా చట్టానికి తూట్లు...

ఏజెన్సీలో పేసా చట్టం ప్రకారం గిరిజనేతరులు ఎలాంటి మద్యం అమ్మకాలు చేపట్టరాదు. అయిన ఇక్కడ ఆ చట్టానికి ఉల్లంఘించి దర్జాగా వివిధ కిరాణాల్లో, విద్యా సంస్థల కూడల్లో వెలిసిన బెల్టు షాపుల పై జిల్లా ఉన్నతాధికారులు కొరడా ఝులిపించాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

దొంగ అరెస్ట్ రిమాండ్‌కు తరలింపు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఇటీవల పట్టణంలోని మారెమ్మ ఆలయంలో చోరీ చేసిన ఒక దొంగను పట్టుకొని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు వన్ టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. ఫిబ్రవరి 27న జరిగిన చోరీ కేసులో చిలుకూరి లక్ష్మీనగర్‌కు చెందిన షేక్ అబ్దుల్ ఫయజ్ ఎన్టీఆర్ చౌక్ లో పట్టుకున్నట్టు పేర్కొన్నారు. అతడి వద్ద నుంచి ముక్కు పుడుక స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బొక్కలగూడకు చెందిన మరో దొంగ అజీజ్ పరారీలో ఉన్నట్టు తెలిపారు.

సాంప్రదాయాల పరిరక్షణకు పాటు పడాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆదివాసి విజ్ఞాన కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోని, సంస్కృతి సాంప్రదాయాల పరిరక్షణకు పాటు పడాలని ఆదివాసి సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్‌రావు మొకాశి అన్నారు. ఆదివారం గుడిహత్నూర్ మండల కేంద్రంలో ఉట్నూర్ వెళ్లే రోడ్డు మాన్కపూర్ గ్రామం దగ్గర ఆదివాసి విజ్ఞాన కేంద్రాన్ని ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కోవ దౌలత్‌రావు మొకాశి, రిటైర్డ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ తొడసం చందు, ప్రాముఖ వ్యాపార వేత్త ఏలేటి అశ్విన్‌రెడ్డి, ఆదివాసీ గ్రామ పటేళ్లలతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఆదివాసీ సమాజ పరిరక్షణకు, సంస్కృతి సాంప్రదాయాల, మానుగడకు ఆదివాసి విజ్ఞాన కేంద్రాన్ని ప్రారంభించు కోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఏర్పాటు చేసినటువంటి విజ్ఞాన కేంద్రం ఒక మైలు రాయిగా నిలుస్తుందని, ఇది ప్రతి ఆదివాసీ జీవితలలో వెలుగులు నింపుతూ ప్రభుత్వాలకు, అధికారులకు వారధిగా ఉంటుందని అన్నారు. అనంతరం ఇటీవల కాలంలో ప్రధాన మంత్రి మాన్ కీ భాత్ కార్యక్రమంలో ప్రశంసలు అందుకున్న తొడసం కైలాస్‌ను ఆదివాసీ సేన ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఆదివాసీ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడి సాయిబాబు, రాష్ట్ర కోశాధికారి కుమురం అనిల్ కుమార్, జిల్లా కార్యదర్శి కోవ నాగోరావ్, వజ్జ జ్యోతిబసు, ఆదివాసీ సేన జిల్లా అధ్యక్షులు రాయిసిడం జంగు పటేల్, కుంరం భీం ఆసిఫాబాద్ జిల్లా అధ్యక్షులు కొట్నాక గణపతి, ఆదివాసి సేన మంచిర్యాల జిల్లా అధ్యక్షులు పెందూర్ శ్రీనివాస్, రాయి సెంటర్ సార్మేడిలు పెందోర్ జైరాం, కాత్లె భారత్, ఆదివాసి గ్రామ పటేళ్ల పోరం అధ్యక్షులు ఆత్రం భీంరావ్, ఆదివాసి సేన జిల్లా సలహాదారులు ఉయిక లక్ష్మణ్, ఆదివాసీ సేన వివిధ మండలాల అధ్యక్షులు సేడ్మకి భీంరావ్, ఉయిక శ్యాంరావు, మేస్రం సుదర్శన్, సోయం గుణవంత్, మడవి వెంకటరావు, కాత్లె విఠల్, కుంరం చత్రుఘన్, సలాం జాకు, తొడసం రమేష్, సేడ్మకి కాశీరాం, కొట్నాక కేశవ్, కుడ్మెత మనోహర్, గేడం జంగు, ఆలం శ్రీను, మడవి రాము, కుంరం విష్ణు, ఆదివాసీ గ్రామ పటేళ్లు పాల్గొన్నారు.

ముగిసిన మల్లన్న జాతర



నవతెలంగాణ-సారంగాపూర్

మండలంలోని మలక్‌చించొలి గ్రామ సమీపంలో స్వర్ణ తీరాన ఉన్న మల్లేశ్వరస్వామి ఆలయ జాతర ఉత్సాహాలు శివరాత్రి బుధవారం రోజున పల్లకి సేవతో ప్రారంభమై ఆదివారం అన్నదానంతో ముగిశాయి. పల్లకి భజా భజంత్రీలతో సారంగపూర్, కౌట్ల(బి), జౌలి, నారాయణ పల్లె గ్రామాల పర్యటన గురువారం రోజు ఆలయానికి చేర్చారు. శుక్రవారం గ్రామ సంకీర్తన, శనివారం చల్ల అబ్బాళ్ళు, అర్ధరాత్రి స్వామివారి రథోత్సవం, ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమలు జాగరణ ఆదివారం ఉదయం అన్నపూజా అనంతరం మహా అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయానికి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ నిర్వాహకులు అన్ని ఏర్పాట్లను చేశారు.

ఘనంగా దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి



నవతెలంగాణ-నిర్మల్

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ దివంగత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని ప్రభుత్వం మార్చి 2న రాష్ట్ర వేడుకగా నిర్వహించింది. ఆదివారం కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జయంతి కార్యక్రమంలో డీవైఎస్ఓ శ్రీకాంత్‌రెడ్డి, అధికారులు దుదిల్ల శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ దివంగత శ్రీపాదరావు సర్పంచ్‌గా ప్రారంభమైన తన రాజకీయ ప్రస్థానంలో ఎమ్మెల్యేగా, శాసనసభ స్పీకర్‌గా సేవలందించారని అన్నారు. ప్రజల మధ్య ఉంటూ, వారి కష్టాలలో పాలు పంచుకొని ప్రజానాయకుడిగా ఎదిగారన్నారు. ఈ సందర్భంగా శ్రీపాదరావు సేవలను స్మరించుకుంటూ, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో కలెక్టరేట్ పర్యవేక్షకులు శివరాజ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆదిలాబాద్‌టౌన్ : దుద్దిళ్ల శ్రీపాదరావు ఆంధ్రప్రదేశ్ మాజీ అసెంబ్లీ స్పీకర్ జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించారు. ఆదివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కలెక్టర్ రాజర్షిషా పాల్గొని శ్రీపాదరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పిచారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతి వేడుకలు మార్చి 2న తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా జరపాలని ఫిబ్రవరి 25న నిర్ణయించిందని తెలిపారు. అధికారికంగా రెండో సారి శ్రీపాదరావు జయంతిని యువజనాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ శ్రీపాదరావు మార్చి 2, 1935న జయశంకర్ భూపాలపల్లి జిల్లా ధన్వాడలో జన్మించారని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ స్పీకర్‌గా పని చేశారన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో శాసనసభకు వన్నె తెచ్చిన శ్రీపాదరావు న్యాయవాదిగా ప్రజలకు మంచి సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన రాజకీయ ప్రస్థానంలో మొదటిగా సర్పంచ్ గా రెండు సార్లు ఎన్నికై తదుపరి మహాదేవపూర్ సమితి అధ్యక్షుడిగా ఎన్నికయ్యారని పేర్కొన్నారు. 1984 ఎన్నికల్లో మొదటి సారి మంథని నుంచి శాసన సభ్యులుగా పోటీ చేసి విజయం సాధించి 3 సార్లు శాసన సభ్యునిగా ఎన్నికైనట్లు తెలిపారు. 1994లో ఓటమి పాలు అయినప్పటికీ ప్రజల మధ్యనే ఉంటూ ఎన్నో సేవలు అందించడం, అలాగే 1999 ఏప్రిల్ 13న మహాదేవపూర్ మండలం అన్నారం వెళ్లి వచ్చే అటవీ మార్గంలో ఆయన మృత్యువాత పడ్డారని తెలిపారు. ఆ మహనీయుని గురించి విద్యార్థులు తెలుసుకోవాలని, శ్రీపాదరావు జీవితం నేటి తరానికి ఆదర్శమనీ, స్పీకర్‌గా అసెంబ్లీని నడిపించిన తీరు ఎప్పటికి మరువలేనిదని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ విజయబాబు, రిటైర్డ్ ఆఫీసర్ రత్నాకర్, డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు డీపీఆర్ఓ తిరుమల, ఉపాధ్యాయులు, విద్యార్థులు, సూపరింటెండెంట్ శైలజ, పంచపూల, సిబ్బంది పాల్గొన్నారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



షార్ట్ సర్క్యూట్‌తో కాలిబూడిదైన ఇల్లు

నవతెలంగాణ-సిరికొండ

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైన సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సోంపల్లి గ్రామంలో ఒక వివాహ వేడుకకు అందరూ హాజరయ్యారు. పెండ్లి సంబరాల్లో అందరూ ఉండగా, అదే గ్రామానికి చెందిన వాగ్మారే మాధవ్‌కు చెందిన ఇల్లు షాట్ సర్క్యూట్‌తో ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. ఇంట్లో ఉన్నటువంటి ఫ్రిడ్జ్, టీవీ, కూలర్, బీరువాతో పాటు బీరువాలో ఉన్న లక్ష 30 వేల రూపాయల నగదు, నిత్యావసర సరుకులు, బట్టలు పూర్తిగా కాలిపోయి బూడిదయ్యాయి. దాదాపుగా మూడు లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లింది. మంటలను గమనించిన కొందరు దగ్గరలో ఉన్నటువంటి గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో మంటలను ఆర్పేశారు. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన వాగ్మారే మాధవ్, అతడి కుమారుడు ఇటుక బట్టీలో పని చేయడానికి ఉపాధి కోసం వరంగల్ జిల్లాకి వెళ్లారు. ఇంట్లో అతడి భార్య, వాళ్ల అమ్మ ఇద్దరే ఉంటున్నారు. నిత్యం కూలీ పనులకు వెళ్తే గాని పూటగడవని నిరుపేద కుటుంబానికి చెందిన ఇల్లు పూర్తిగా దగ్ధం కావడం చాలా దారుణమని, ప్రభుత్వం స్పందించి వారి కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకోవాలని గ్రామస్తులు కోరారు. సంఘటన స్థలాన్ని ఎస్పై శివరాం, ఇన్‌చార్జీ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రాజేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ అమూల్, విద్యుత్ శాఖ అధికారులు పరిశీలించారు.

కాలిబూడిదయ్యాక గ్రామానికి చేరుకున్న ఫైర్ ఇంజన్...


మండలంలోని సోంపల్లి గ్రామంలో షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైందని గ్రామస్తులు ఫైర్ ఇంజన్‌కు సమాచారం అందజేశారు. ఇచ్చోడలో ఉన్నటువంటి ఫైర్ ఇంజన్ సోంపల్లి గ్రామానికి చేరుకునే సరికి ఆ ఇల్లు పూర్తిగా దగ్ధమైంది. అంతా అయిపోయాక ఫైర్ ఇంజన్ గ్రామానికి చేరుకోవడంతో జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మండలంలో ఫైర్ ఇంజన్ అందుబాటులో లేకపోవడంతో దూర భారం పెరిగి, ఏవైనా ఇటువంటి ప్రమాదాలు సంభవిస్తే సకాలంలో రాక, జరగాల్సిన నష్టం జరిగిపోతుంది. ఇటువంటి సంఘటనలు జరిగిన కొద్ది క్షణాల్లోనే ఫైర్ ఇంజన్ వస్తే ఏమైనా లాభం ఉంటుందని, ఇకనైనా అధికారులు స్పందించి మండలంలో ఒక ఫైర్ ఇంజన్ అందుబాటులో ఉండేలా చూడాలని మండలవాసులు కోరుతున్నారు.



మంటలార్పేందుకు వచ్చిన ఫైర్ ఇంజన్

రాజధానికి మహాలక్ష్మి ఫ్రీ బస్సు సర్వీసులు నడుపాలి

- తడిసి మోపెడు అవుతున్న రవాణా ఖర్చులు
- గిరిజన నియోజకవర్గ మహిళలపై చిన్న చూపు



నవతెలంగాణ-ఖానాపూర్

సీఎం రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడైన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ నియోజకవర్గంలోని ఖానాపూర్ మండలాల మహిళలకు, మహాలక్ష్మి ఫ్రీ బస్సు పథకం అందని ద్రాక్షగా మారింది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ఖానాపూర్ గిరిజన నియోజకవర్గం మండలాలు, విభజిత మూడు జిల్లాల పరిధిలో ఉండగా, అభివృద్ధిలో వెనుకబాటు తనం అన్ని మండలాల్లో కొట్టొచ్చినట్లు కనబడుతుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన, మహాలక్ష్మి ఫ్రీ బస్ పథకం ఈ నియోజకవర్గ మహిళలకు ఉపయోగం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఖానాపూర్, పెంబి, దస్తురాబాద్, కడెం, మండలాల నుంచి అనేకమంది వ్యాపారస్తులు, విద్యావేత్తలు, విద్యాభ్యాసం కోసం, ఆస్పత్రి వైద్యం, కార్యాలయాల పనులపై హైదరాబాద్‌కు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. కాగా గతంలో కడెం, ఖానాపూర్, నుంచి హైదరాబాద్‌కు ఉదయం ఐదు గంటలకు, రాత్రి 9 :30 నిమిషాలకు, తిరిగి హైదరాబాద్ నుంచి, పది నిమిషాలకు, గతంలో ఎక్స్‌ప్రెస్ సర్వీసులు ఉండేవి, కాగా, ఇటీవల వాటిని రద్దుచేసి, వాటి స్థానంలో, డీలక్స్ బస్సులు ప్రవేశపెట్టడంతో, మహిళలు మహాలక్ష్మి ఫ్రీ బస్సు పథకానికి దూరమయ్యారు. దీంతో పాటు మండలాల్లో కొన్ని ఆర్డినరీ బస్సు సర్వీసులు రద్దు చేయగా, ప్రయాణికులు ఆటోలు, ప్రయివేటు వాహనాలను ఆశ్రయించి, గ్రామాలకు, రాజధానికి పనుల కోసం ప్రయాణాలు సాగిస్తున్నారు. దీంతో గతంలో కన్నా ప్రస్తుతం డీలక్స్ బస్సు చార్జీలు అధికమవడంతో, ప్రజలు ప్రయాణికులు ముఖ్యంగా, మహిళలతో పాటు, పురుషులు కూడా అధిక చార్జీలతో సతమతమవుతున్నామని, పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా నియోజకవర్గ వెనుకబాటుతనాన్ని గుర్తించి, స్థానిక ఎమ్మెల్యే, ఇన్‌చార్జి మంత్రులు, చొరవ తీసుకొని, పక్క జిల్లాల్లో ఉన్నట్లుగా, ఎక్స్‌ప్రెస్ సర్వీస్‌లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

బస్సులు ప్రజలకు అందుబాటులో ఉంచాలి

ఖానాపూర్‌కు హైదరాబాద్‌కు ఫ్రీ బస్సులను అందుబాటులో ఉంచాలి. ఖానాపూర్‌కు గతంలో ఉన్నట్టుగా ఎక్స్‌ప్రెస్ మహాలక్ష్మి ఫ్రీ బస్సును పునరుద్ధరించాలని అన్నారు.

ముధం వైశాలి ప్రయాణికురాలు

ఎమ్మెల్యే చొరవ చూపాలి

రజిత ప్రయాణికురాలు

ఎమ్మెల్యే చొరవ చూపి గతంలో మాదిరిగా ఎక్స్‌ప్రెస్ బస్సులు నడుపాలని హైదరాబాద్‌కు ప్రతిరోజు ఉదయం ఐదు గంటలకు ఖానాపూర్ నుంచి బస్సు వెళ్లే విధంగా చూడాలి

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
సోమవారం | మార్చి 03, 2025 | www.navatelangana.com

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శికి శుభాకాంక్షలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



ఇటీవల సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికై ప్రస్తుతం మహబూబ్ నగర్‌లో జరుగుతున్న కేవీపీఎస్ రాష్ట్ర కమిటీ సమావేశాలకు ముఖ్య అతిథిగా హాజరైన జాన్ వెస్లీకి కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో రాష్ట్ర కేవీపీఎస అధ్యక్షుడిగా పనిచేసిన జాన్ వెస్లీ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా ఎంపిక కావడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. జాన్ వెస్లీ మాట్లాడుతూ కుల వివక్ష రహిత సమాజం కోసం ఋుషి చేయాలని సూచించారు. ఇంకా కొన్ని చోట్ల వివక్ష సాగుతోందని అటువంటి వాటి పట్ల కెవిపిఎస్ అప్రమత్తంగా ఉంటూ పోరాటం చేయాలన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్



మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఆత్రం సక్కు జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలో మండల అధ్యక్షుడు మాసాడే చరణ్ అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. ఆత్రం సక్కు గొప్పధనాన్ని కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంఘం రైతు అధ్యక్షుడు వైరగడే మారుతి పటేల్, కాంగ్రెస్ నాయకులు వసంతరావు, కలీం, కార్తీక్, దీపక్, శైలేందర్, నాగోసి శంకర్, జుగాడిరావు, జలీమ్, భీంరావు, జావిద్, గోపాల్ పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

- మారిన నిబంధనలు..విద్యార్థులు జాగ్రత్త
- హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్



పరీక్షలు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈనెల 5 నుండి ప్రారంభమయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలకు జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇప్పటికే పరీక్షలకు సంబంధించిన ప్రశ్నపత్రాలు జిల్లాలోని వివిధ సెంటర్లకు సమీపంలో గల పోలీస్ స్టేషన్లకు చేరగా కస్టోడియన్‌లు వాటిని ఆయా పోలీస్ స్టేషన్లలో భద్రపరిచారు. ప్రస్తుత సంవత్సరం పరీక్షలకు ఇంటర్మీడియట్ బోర్డు నిబంధనలు మార్చడంతో సిబ్బంది విద్యార్థులను అప్రమత్తం చేస్తున్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు సర్వం సిద్ధం

జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో మొత్తం 10,043 మంది హాజరు కానున్నారు. ఇందులో మొదటి సంవత్సరం విద్యార్థులు 4756 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 5287 మంది ఉన్నారు. వీరి కోసం మొత్తం 19 పరీక్ష కేంద్రాల ఏర్పాటు, సీఎస్, డీఓలను నియమించడంతో పాటు డీఈసీ కమిటీని కూడా ఏర్పాటు చేశారు. పరీక్షలకు సంబంధించిన సీఎస్, డీఓలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

మారిన నిబంధనలు విద్యార్థులు జాగ్రత్త

ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రస్తుత సంవత్సరం బోర్డు అనేక నిబంధనలు మార్చింది. వీటి పట్ల విద్యార్థులు జాగ్రత్తగా లేకుంటే ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి తలెత్తే అవకాశం ఉంది. గత సంవత్సరం ఒక్క నిమిషం ఆలస్యం నిబంధన ఉండగా, ప్రస్తుతం 15 నిమిషాలు ముందుకు అనగా 8:45 వరకు విద్యార్థులు లోనికి రావాలని నిబంధనలో తెలిపారు. చేతి గడియారాలు లోనికి అనుమతించరు. సెంటర్లలో సీసీ కెమెరాలు కూడా ఏర్పాటు చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. పావు గంట ముందు నిబంధన పట్ల విద్యార్థుల అప్రమత్తంగా ఉండాలని సిబ్బంది తెలుపుతున్నారు.

హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్

ప్రస్తుత సంవత్సరం ఇంటర్మీడియట్ ప్రాక్టికల్ పరీక్షల హాల్ టికెట్ల డౌన్‌లోడ్ కోసం ఫోన్ నెంబర్లకు లింకు పంపించిన ఇంటర్మీడియట్ అధికారులు, మరింత ముందుకు వెళ్లి వార్షిక పరీక్షలకు సంబంధించిన హాల్ టికెట్లపై క్యూఆర్ కోడ్ పెడుతున్నారు. దీనిద్వారా విద్యార్థికి పరీక్ష కేంద్రానికి సంబంధించిన వివరాలతో పాటు పరీక్ష కేంద్రం అడ్రస్ తెలపడానికి ఒక ప్రత్యేక ఫోన్ నెంబర్ కూడా తెలియనుంది. దీంతో విద్యార్థి సెంటర్‌కు సులువుగా చేరుకునే అవకాశం ఉండనున్నట్లు అధికారులు తెలుపుతున్నారు.

ఒక్క నిమిషం నిబంధన మాత్రమే ఉంటుంది

కళ్యాణి, ఇంటర్మీడియట్ విద్యాధికారిణి



ఈనెల 5 నుండి నిర్వహించే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఒక్క నిమిషం నిబంధన వర్తిస్తుంది. 15 నిమిషాలు ముందుగా విద్యార్థులు కేటాయించిన గదిలోకి వెళ్తే పరీక్ష పట్ల ఉన్న భయం పోతుందనే ఉద్దేశంతో ఇంటర్మీడియట్ బోర్డు 15 నిమిషాలు ముందుగా పరీక్ష కేంద్రంలోకి వెళ్లాలని నిబంధన విధించింది. విద్యార్థులను 9 గంటల వరకు పరీక్ష కేంద్రంలోకి అనుమతించడం జరుగుతుంది. క్యూఆర్ కోడ్‌తో విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుంది. పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేశాం. విద్యార్థులు బాగా రాసి ఉత్తమ ఫలితాలతో జిల్లాకు మంచి పేరు తీసుకురావాలి.



ప్రశ్న పత్రాలు స్టేషన్‌లో భద్రపరుస్తున్న దశ్యం (ఫైల్)

కాలినడకన వెళ్లి.. సమస్యలు తెలుసుకుని..

- గిరిజన ప్రాంతాల్లో పర్యటించిన ఏఎస్పీ



నవతెలంగాణ-తిర్యాణి

ఆసిఫాబాద్ ఎస్డీపీఓగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత చిత్తరంజన్ తన ప్రత్యేకతను చాటుతున్నారు. తాజాగా మండలంలోని మారుమూల గ్రామాలైన గోవెన, కుర్సిగూడ, నాయకపుగూడ గ్రామాలకు దాదాపు 20 కిలోమీటర్లు కాలినడకన వెళ్లి సమస్యలు తెలుసుకునే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజల స్థితిగతులను అడిగి తెలుసుకోవడంతో పాటు బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలని సూచించారు. యువతకు భరోసా ఇచ్చే విధంగా పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా వాలీబాల్ కిట్లు, టీషర్ట్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివాసీ ప్రజలకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిస కావద్దని సూచించారు. గ్రామాల్లో అపరిచిత వ్యక్తులు ఎవరు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. మావోయిస్టు కార్యకలాపాలకు యువతతో పాటు ప్రజలు సహకరించొద్దన్నారు. గ్రామస్తులకు ఎటువంటి అవసరం పడ్డ వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్‌లో సంప్రదిస్తే సహకారం అందించనున్నట్లు వివరించారు. అనారోగ్యంతో బాధపడుతున్న శంభురావు అనే బాలుని పరామర్శించి త్వరలో ట్రీట్‌మెంట్ అయ్యేవిధంగా పోలీస్ శాఖ తరపున చూస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో నిషేధిత గంజాయిని పండించొద్దన్నారు. అసాంఘిక కార్యకలాపాలకు సంబంధించి సమాచారాన్ని పోలీసులకు తెలియజేయాలని కోరారు. పోలీస్ శాఖ అండగా ఉండి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెబ్బెన సీఐ బుద్దె స్వామి, ఎస్ఐ శ్రీకాంత్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-జైనూర్

మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఆసిఫాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు జన్మదిన వేడుకలను పార్టీ శ్రేణులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి ఆత్రం సుగుణ, జైనూర్ మార్కెట్ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ఒకరికొకరు స్వీట్లు తినిపించుకొని జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కాంగ్రెస్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రతి కార్యకర్త గ్రామానికి వెళ్లి క్షేత్రస్థాయిలో సమస్యలను పరిష్కరించి ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకొచ్చి ప్రజలకు సేవలందించేందుకు కృషి చేయాలన్నారు. కార్యకర్తలందరు కలిసికట్టుగా ముందుకెళ్తూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని తెలిపారు. సమాజ సేవలో ఆత్రం సక్కు ఎన్నో మంచి సేవా కార్యక్రమాలు చేస్తూ ప్రజల గుండెల్లో నిలిచారని కొనియాడారు. అనంతరం కేజీబీవీ పాఠశాలలో పలువురు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు, పెన్సిళ్లు అందజేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు అబ్దుల్ ముకిద్, నాయకులు మెస్రం అంబాజీ, జెన్నవార్ పవన్, కనక గంగారాం, మాజీ వైస్ ఎంపీపీలు చిర్లె లక్ష్మణ్, షేక్ రషీద్, కార్యకర్తలు అజ్జులాల, సుద్దాల శ్రీనివాస్, పెందూర్ లచ్చు పాల్గొన్నారు.

రేపు, ఎల్లుండి వైద్య ఆరోగ్య శిబిరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని బెజ్జూర్ మండల కేంద్రంలో జిల్లా అటవీశాఖతో పాటు సింగరేణి కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో రేపు, ఎల్లుండి(అనగా ఈ నెల 4, 5 తేదీల్లో) వైద్య ఆరోగ్య శిబిరం నిర్వహించనున్నట్లు జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవాల్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైద్య ఆరోగ్య శిబిరానికి జనరల్ మెడిసిన్, కీళ్ల వైద్య నిపుణులు, స్త్రీల వైద్య నిపుణులు రానున్నట్లు, ఉచిత పరీక్షలతో పాటు మందులు కూడా అందించనున్నట్లు, ప్రజలు దీనిని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు.

ప్రారంభమైన రంజాన్

నవతెలంగాణ-జైనూర్

రంజాన్ పవిత్రమాసం ప్రారంభం కాగా శనివారం సాయంత్రం నెలవంకను చూసి ఆదివారం నుండి 30 రోజుల వరకు ముస్లిం సోదరులు రంజాన్ మాసంతో కటోరమైన ఉపవాసంతో దీక్షలు చేస్తారు. ఈ సందర్భంగా ఉదయం నుండి సాయంత్రం ఉపవాసం ఉండి నెల రోజుల వరకు చిన్నారులు, మహిళలు, వృద్ధులు ప్రతి ఒక్కరు రంజాన్ మాసం సందర్భంగా ప్రత్యేక తిలావత్‌తో కురాన్‌ను చదివి సాంప్రదాయాలను గౌరవిస్తూ నెల రోజుల వరకు ఉపవాస దీక్షలు పాటిస్తారు. రంజాన్ మాసం సందర్భంగా మండలంలోని ప్రతి మసీదులో ప్రత్యేకంగా ముస్తాబు చేసి ప్రార్థనలు చేస్తున్నారు.

ఆలయ నిర్మాణానికి భూమి పూజ

నవతెలంగాణ-బెజ్జూర్



మండలంలోని నాగులవాయి గ్రామంలో ఆదివారం హనుమాన్ ఆలయ నిర్మాణానికి గ్రామస్తులు భూమి పూజ చేశారు. గ్రామంలో హనుమాన్ ఆలయం లేకపోవడంతో గ్రామస్తులంతా కలిసి ఆలయాన్ని నిర్మించేందుకు శ్రీకారం చుట్టారు. గ్రామస్తుల, దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించనున్నారు. ఇందులో మాజీ ఉపసర్పంచ్ నీకాడి బాపూరావు, గ్రామస్తులు కావిడి నందయ్య, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

కుంగిపోయిన వరండా

- ఇబ్బందుల్లో విద్యార్థులు

నవతెలంగాణ-బెజ్జూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల వరండా పూర్తిగా కుంగిపోయింది. దీంతో విద్యార్థులు నడవడానికి ఇబ్బందులు పడుతున్నారు. వరండాల్లో వేసిన బండలు పైకి లేచి విద్యార్థులు నడిచినప్పుడు కాళ్లకు తగులుతున్నాయి. దీంతో విద్యార్థులకు గాయాలైన సందర్భాలున్నాయి. కళాశాల నిర్మించిన అప్పటినుండి మరమ్మతులు చేయకపోవడంతో ఇబ్బందులు తప్పడం లేదని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తరగతి గదుల్లో సైతం ఇదే పరిస్థితి నెలకొందని తెలిపారు. మరో మూడు రోజుల్లో వార్షిక పరీక్షలున్న నేపథ్యంలో విద్యార్థులు కళాశాలలో పరీక్షలు ఎలా రాస్తారని మండల వాసులు ప్రశ్నిస్తున్నారు. వరండాతో పాటు తరగతి గదుల్లో మరమ్మతులు చేపట్టాలని అధికారులకు పలుమార్లు విన్నవించిన పట్టించుకోవడంలేదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వెంటనే వరండాతో పాటు తరగతి గదిలో మరమ్మతులు చేపట్టాలని విద్యార్థులు కోరుతున్నారు.



పెచ్చులూడిన ఫ్లోరింగ్



కుంగిపోయిన వరండా

ముస్లింలకు పవిత్ర మాసం రంజాన్

- నెల రోజుల పాటు పగటి పూట కఠిన ఉపవాసం
- పేద ధనిక తేడా లేకుండా ఘనంగా వేడుకలు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆధ్యాత్మికంగా ఎంతో ప్రాముఖ్యమున్న రంజాన్ మాసం ప్రత్యేక ప్రార్థనలు, కఠిన ఉపవాస దీక్షలు, దానధర్మాలు, ఆధ్యాత్మిక సందేశాలతో సాగుతుంది. మహ్మద్ ప్రవక్త హజరత్ రసూల్ అల్లాహ్ మానవులను కష్టాల నుంచి కాపాడేందుకు ఈ మాసాన్ని సృష్టించినట్లు చరిత్ర చెబుతోంది. ఈ మాసంలో రోజుకు ఐదు పర్యాయాలు నమాజ్‌తో పాటు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. పవిత్ర మాసంలో దానధర్మాలకు కూడా ప్రత్యేకమైన స్థానం ఉంది. ఈ నెలలో చనిపోతే నేరుగా స్వర్గానికి చేరుతారని, నరకపు ద్వారాలు మూసి ఉంటాయని ముస్లింల నమ్మకం.



ఉపవాస దీక్షలు

రాష్ట్రంలో చంద్రుడు శుక్రవారం రాత్రి కనబడలేదని, ఉపవాసాలు ఆదివారం నుంచి చేపట్టాలని మతపెద్దలు ప్రకటించారు. ఇందువల్ల ఆదివారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ మాసంలో ముస్లింలు తెల్లవారు జామున 4 గంటలకే ఆహారం తీసుకుంటారు. అనంతరం సూర్యాస్తమయం వరకు నీరు, ఆహారం, కనీసం ఎంగిలి కూడా మింగ కుండా కఠోర ఉపవాస దీక్ష చేపడతారు. వయస్సులో తారతమ్యం లేకుండా చిన్న, పెద్ద, ముసలి వారు సైతం భక్తి శ్రద్ధలతో ఉపవాస దీక్షలో ఉంటారు. ఉపవాస దీక్షలతో బలహీనతలు, వ్యసనాలను జయించవచ్చని ఇస్లాం మత గురువులు చెబుతారు. ఉపవాస దీక్షల వల్ల జీర్ణశక్తి పెరిగి ఆరోగ్యంగా ఉంటారని శాస్త్రం చెబుతుంది. ఉపవాస దీక్షలు (రోజా) సహరీతో ప్రారంభమై ఇఫ్తార్‌తో ముగుస్తాయి.

ఇఫ్తార్ విందులు

ఖర్జూరపు పండుతిని దీక్ష విరమించే ముస్లింలు అనంతరం వివిధ రకాలైన రుచికరమైన వంటకాలను భుజిస్తారు. పలు ప్రాంతాల్లో ఉపవాస దీక్షను ఉప్పుతో కూడా విరమిస్తారు. ఈ వంటకాలతో పాటు సాంప్రదాయ వంట హలీమ్‌ను తయారు చేసే హోటళ్ళు ఈ నెలంతా కొనుగోలుదారులతో బిజీబిజీగా ఉంటాయి.

'సుర్మా'తో కళ్లకు కొత్త అందం

కళ్లకు 'సుర్మా' పెట్టుకోవడం కూడా ముస్లింలు సున్నత్‌గానే భావిస్తారు. ప్రవక్త హజరత్ మహ్మద్ సదా సుర్మా పెట్టుకునేవారని అంటారు. కాటుక లాగే కళ్లకు రాసు కునే సుర్మా పౌడర్ రూపంలో ఉంటుంది. ముస్లింలు అందమైన భరిణెల్లో వీటిని దాచుకొని ఇంటికి వచ్చిన అతిథులకు అత్తరుతో పాటు కళ్లకు పెట్టు కోవడానికి కూడా ఇవ్వడం సాంప్రదాయం. ప్రతి నమాజుకు ముందు సాంప్రదాయం ప్రకారం ముఖం, కాళ్ళు, చేతులు శుభ్రం చేసుకుని సుర్మా పెట్టుకుంటారు.

నమాజ్ విశిష్టత

ప్రతి మాసంలోను శుక్రవారం రోజున ముస్లింలు నమాజ్ చేయడం పరిపాటి. ఇక రంజాన్ మాసంలో మత పెద్దలతో నమాజ్ చేయించడం ప్రశస్తమైనది. మసీద్‌కు వెళ్ళలేనివారు ఉన్న స్థలాన్ని శుభ్రం చేసుకొని, ప్రార్థన చేసి భగవంతుడి కృపకు పాత్రులవుతారు. ముస్లింలు రంజాన్ ఆఖరు పది రోజులు ఇళ్ళు వదలి మసీదుల్లో ఉంటూ మహాప్రవక్త అల్లాహ్ గురించి ప్రార్థనలతో ఆధ్యాత్మిక భావాన్ని అలవర్చుకుంటారు.

దానధర్మాలు

తాము సంపాదించిన దానిలో పేదవారికి కనీసం నూటికి రూ.2.50పై, గోధుమలు, సేమియా, వస్త్రాలు, బంగారం దానం చేయాలని ఖురాన్ చెబుతోంది. రంజాన్ నెలలో ఇలా దానం చేస్తే పేద వారు కూడా పండుగ పూట సంతోషంగా ఉంటారని ముస్లిం పెద్దలు చెబుతుంటారు.

ఈదుల్ ఫితర్

రంజాన్ పండుగను ఈదుర్ ఫితర్ అని అంటారు. బాల చంద్రుని దర్శించిన తరువాతి రోజు ఉదయం పండుగను జరుపుకొంటారు. పండుగ ప్రార్థనలను ఈద్గాలోనే జరుపుతారు. నమాజ్ అనంతరం ముస్లింలు, ముస్లిమేతరులు ఒకరినొకరు ఆలింగనం చేసుకుని ఈద్ శుభాకాంక్షలను తెలుపుకొంటారు. పండుగ రోజు షీర్ ఖుర్మా అనబడే తీయటి సేమియాను తప్పక వండుతారు.

రంజాన్ కోసం ముస్తాబైన మసీదులు

రంజాన్ మాసం ప్రారంభాన్ని పురస్కరించుకుని ముస్లింలు ఆయా ప్రాంతాల్లోని మసీదులను ప్రార్థనల కోసం ప్రత్యేక హంగులతో ముస్తాబు చేశారు. మసీదులు నూతన శోభతో ఉపవాస ప్రార్థనల కోసం సిద్ధమయ్యాయి. మసీదులకు రంగులు వేయడంతో పాటు విద్యుత్ దీపాలంకరణ, మరమ్మతులు పూర్తి చేశారు. అలాగే సహరీ, ఇఫ్తారీల ఏర్పాట్లు కూడా చేశారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో ప్రత్యేక తారావీహ్ నమాజ్‌లను ఆచరించేందుకు మసీదుల్లో ఖురాన్ హాఫిజ్(ఖురాన్ కంఠస్తం చేసిన వారు)లను కూడా ఏర్పాటు చేయడం జరిగింది.

రంజాన్ ప్రత్యేకతలు

ఈ మాసంలో సహృదయం, దైవభక్తితో సత్కార్యం చేసిన వ్యక్తికి ఇతర మాసాల్లో చేసిన 'ఫరజ్'కి లభించే పుణ్యఫలం లభిస్తుంది. ఫరజ్‌ని ఆచరిస్తే ఇతర మాసాల్లో లభించే 70 విధులకు సమానమైన పుణ్యఫలాలు ప్రాప్తమవుతాయి. దివ్య ఖురాన్ ఈ మాసంలోనే అవతరించింది. హజరత్ దావూద్‌కు ఈ మాసంలోనే 'జబూర్' గ్రంథం ఇవ్వబడింది. హజరత్ జిబ్రాయిల్ ప్రతి సంవత్సరం ఈ మాసంలో మహాప్రవక్తకు దివ్య ఖురాన్‌ను సంపూర్ణంగా వినిపించేవారు.

మున్సిపాలిటీకి మార్కెట్ ఏది..?

- పట్టణ ప్రజలకు తప్పని తిప్పలు
- ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ



జూబ్లీ మార్కెట్ (ఫైల్)

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఆవిర్భవించి సంవత్సరం పూర్తయిన పూర్తిస్థాయిలో నిర్మాణం కాకపోవడంతో అటు ప్రజలు ఇటు అధికారులు కూడా ఇబ్బందులు పడుతున్నారు. మున్సిపాలిటీగా ఆవిర్భవించిన తర్వాత ఆసిఫాబాద్ రాజంపేట పంపకాలు, విభజన ప్రక్రియ ఆరు నెలల పాటు కొనసాగగా నూతన గృహాలు నిర్మించుకునేవారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం ఆ సమస్య తీరిన మున్సిపాలిటీకి ఆదాయం పెరిగే వనరులు మాత్రం కరువయ్యాయి.

మున్సిపాలిటీకి మార్కెట్ ఏది?

అసిఫాబాద్ గ్రామపంచాయతీగా ఉన్నంతకాలం జిల్లా కేంద్రంలోని వివేకానంద చౌక్ వెనకాల కూరగాయల మార్కెట్ ఏర్పాటు చేయగా పశువుల వారసంత ప్రస్తుత జూబ్లీ మార్కెట్ వైపు ఏర్పాటు చేసేవారు. తర్వాతక్రమంలో జూబ్లీ మార్కెట్ నిర్మాణం పూర్తి కావడం పాత కూరగాయల మార్కెట్‌ను అక్కడికి తరలించారు. అనంతరం ఆసిఫాబాద్ మున్సిపాలిటీగా ఆవిర్భవించి, జూబ్లీ మార్కెట్ రాజంపేటకు కేటాయించబడడంతో మున్సిపాలిటీకి మార్కెట్ లేకుండా పోయింది.

పట్టణ ప్రజలకు తప్పని తిప్పలు

పట్టణం మధ్యలో కూరగాయల మార్కెట్ ఉండడంతో ప్రజలు ఖాళీ సమయాల్లో కూరగాయలు కొనుక్కొని తీసుకొని వెళ్లేవారు. జిల్లా కేంద్రంగా మారడంతో పట్టణం పరిధి పెరగడంతో పాటు కూరగాయల మార్కెట్ కూడా జూబ్లీ మార్కెట్‌కు తరలివెళ్లడంతో పాత కలెక్టరేట్ వైపు అంకుసాపూర్ వైపు ఉన్న ప్రజలు కూరగాయల కొనుగోలుకు ఇబ్బందులు పడుతున్నారు.

ఆదాయం కోల్పోతున్న మున్సిపాలిటీ

ప్రస్తుతం జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న జూబ్లీ మార్కెట్‌తో పాటు వారసంత కూడా రాజంపేట గ్రామపంచాయతీలకు వెళ్లడంతో కూరగాయల మార్కెట్ ద్వారా వచ్చే ఆదాయాన్ని మున్సిపాలిటీ కోల్పోవాల్సి వస్తుంది. జూబ్లీ మార్కెట్‌కు వచ్చేవారు మున్సిపాలిటీకి చెందిన వారు కావడం మున్సిపాలిటీలో మార్కెట్ లేకపోవడంతో ఆదాయం రాజంపేట గ్రామపంచాయతీకి వెళ్తుంది. పాత మార్కెట్ స్థానంలో కానీ లేదా వ్యవసాయ మార్కెట్ స్థలంలో కానీ మార్కెట్ ఏర్పాటు చేస్తే ప్రజలకు సౌకర్యంగా ఉండడంతో పాటు ఆదాయం కూడా పెరిగే అవకాశం ఉంటుంది.

మున్సిపాలిటీ పరిధిలో మార్కెట్ ఏర్పాటు చేయాలి

శ్రీకాంత్, స్థానికుడు

మున్సిపాలిటీ పరిధిలో కూరగాయల మార్కెట్ ఏర్పాటు కోసం అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రస్తుత జూబ్లీ మార్కెట్ బ్రాహ్మణవాడతో పాటు సందీప్ నగర్, జనకాపూర్ ప్రాంత ప్రజలకు దూరంగా ఉంది. పట్టణ మధ్యలో మార్కెట్ ఏర్పాటు చేస్తే అందరికీ అందుబాటులో ఉంటుంది.

జిల్లాకు వచ్చే వలసవాద వ్యాపారులను కట్టడి చేయాలి

నవతెలంగాణ ఆసిఫాబాద్

స్థానిక వ్యాపారస్తులను ఇబ్బందుల గురి చేసే విధంగా వ్యవహరిస్తున్నందున జిల్లాకు వచ్చే వలసవాద వ్యాపారులను కట్టడి చేయాలని ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి రేగుంట మహేష్ డిమాండ్ చేశారు. మండలంలోని అంక్సాపూర్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇతర ప్రాంతాల వలసవాద వ్యాపారులతో స్థానిక వ్యాపారులు ఇబ్బందులు పడడమే కాకుండా కార్మికులు యువత కూడా ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలోని ఇటుక బట్టీలలో బీహార్, ఉత్తరప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రం నుండి వచ్చే కూలీల సంఖ్య పెరుగుతుండగా, వ్యాపారాలలో రాజస్థాన్, గుజరాత్ నుండి వచ్చే వారి సంఖ్య పెరుగుతుందన్నారు. దీనితో స్థానికంగా ఉండేవారు ఉపాధి కోల్పోవాల్సిన దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అటువంటి వారిని కట్టడి చేసే విధంగా జిల్లా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకొని వెనుకబడిన జిల్లాలోని వ్యాపారులను రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్ల మల్లేష్, ఇగూరపు శ్రీకాంత్, అనుముల అశోక్, రేగుంట గణేష్, ఇగూరపు అది, వడ్లరి చందు, పోర్ల సిద్దు పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మంచిర్యాల
4
సోమవారం | మార్చి 03, 2025 | www.navatelangana.com

కవ్వాల్ ఫారెస్ట్‌లో అధికారుల బర్డ్ వాక్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



కవ్వాల్ ఫారెస్ట్‌లో బర్డ్ వాక్ ఫెస్టివల్ లక్షెట్టిపేట రేంజ్ పరిధిలోని వెంకట్రావుపేట చెరువు వద్ద పక్షుల కిలకిలలతో కనువిందు చేస్తుంది. ఆదివారం బర్డ్ వాక్ కార్యక్రమంలో భాగంగా పక్షులను చూడటానికి పీసీసీఎఫ్ సువర్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అటవీ శాఖ అధికారులు వలస పక్షులపై అధ్యయనం చేస్తున్నారని, విదేశాల నుంచి వివిధ రకాల పక్షులు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌డీపీటీ శాంతారాం, డీఎఫ్ఓ శివ ఆశిష్ సింగ్, ఎఫ్ఆర్ఓ సుభాష్ పాల్గొన్నారు.

బీఎన్‌కేఎస్ మాజీ అధ్యక్షుడికి ఘన నివాళి

నవతెలంగాణ-మంచిర్యాల



భవన నిర్మాణ కార్మిక సంఘం మంచిర్యాల జిల్లా మాజీ అధ్యక్షుడు రామ్‌రాజయ్యకు ఆ సంఘం ఆధ్వర్యంలో స్థానిక ఐబీ చౌరస్తాలో ఆదివారం ఘన నివాళ్లు అర్పించారు. రామ్ రాజయ్య సేవలు మరువలేనివి అని పలువరు కొనియాడారు. కార్మికుల కోసం నిరంతరం పోరాటం చేసినటువంటి ఆయన కార్మిక సంక్షేమం కోసం పాటుపడ్డాడన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దపల్లి సూరన్న, జిల్లా అధ్యక్షుడు పడాల రామన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి మంచేర్ల సదానందం, బీసీ నాయకులూ మాజీ వైస్ చైర్మన్ ముఖేష్‌గౌడ్, తుల మధుసూదన్, బెల్లంకొండ మురళి,బీసీ కార్మికసమాజ్ రాష్ట్ర నాయకులు నరేడ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వసతులు కల్పించడంలో విఫలం

నవతెలంగాణ నస్పూర్

శ్రీశైలంలోని ఎస్ఎల్బీసీ టన్నెల్ నిర్మాణంలో కార్మికులు గల్లంతైన విషయం విధితమేనని, వారిని కాపాడడానికి ఎంతో అపారమైన అనుభవం ఉన్న భూగర్భంలో కార్మికులు వెళ్లారని, వారికి వసతులు కల్పించడంలో సింగరేణి, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని టీబీజీకేఎస్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సింగరేణి ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం, సింగరేణి యాజమాన్యం ఆదేశించిన పిదప సింగరేణి రెస్క్యూ సిబ్బందితోపాటు 200 మంది సింగరేణి ఉద్యోగులు పాల్గొనడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించిన రెవెన్యూ శాఖ, సింగరేణి యాజమాన్యం, కనీస మౌలిక వసతులు కల్పించడంలో పూర్తిగా వైపల్యం చెందరన్నారు. విపత్కర పరిస్థితులలో నాలుగు నుండి ఆరు గంటల వరకే పని చేయాల్సిందిగా చట్టాలు చెబుతున్నప్పటికీ వారిని టన్నెల్‌లో 12 గంటలు కష్టపడుతున్నారని, అనంతరం వారికి రిఫ్రెష్మెంట్, తాగునీరు, భోజన వసతి, రెస్ట్ తీసుకోవడానికి వసతులు కల్పించకపోవడం దుర్మార్గమైన చర్య అని అదేవిధంగా ఉద్యోగులకు ఓడీ మాస్టర్‌గా పరిగణించడం అత్యంత దారుణమైన విషయమని పేర్కొన్నారు. రెస్క్యూ చేయడానికి వెళ్ళిన సింగరేణి ఉద్యోగులు రిస్క్ లో పడకుండా వారి యొక్క ఆరోగ్యాలను దృష్టిలో ఉంచుకొని కనీస మౌలిక వసతులు కల్పించి, ఎమర్జెన్సీ ప్రకారం ఆరు గంటల పని విధానాన్ని కల్పించి, వారందరికీ ఆన్ డ్యూటీగా మస్టర్ కల్పించడంతోపాటు వారికి ఎమర్జెన్సీ స్పెషల్ అలవెన్స్ కల్పించాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం డిమాండ్ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

డీజే సౌండ్స్, ర్యాలీలు నిషేధం : సీఐ

నవతెలంగాణ-నస్పూర్

డీజే సౌండ్స్, ర్యాలీలు నిషేధిస్తున్నట్లు మంచిర్యాల రూరల్ సీఐ అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మార్చ్ 5వ తేదీ నుంచి 23వ తేదీ వరకు తెలంగాణలో ఇంటర్మీడియట్, మార్చి 21 నుండి నాలుగో తేదీ ఏప్రిల్ వరకు పదవ తరగతి పరీక్షలు జరుగుతున్నందున నస్పూర్ పట్టణంలో ఇలాంటి అనుమతి లేకుండా డీజే సౌండ్స్ పెట్టుకుని ర్యాలీలు చేయడం నిషేధిస్తున్నట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా డీజే సౌండ్స్ పెట్టడం చేస్తే అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

రైతు ఖాతాకు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

నవతెలంగాణ-జైపూర్

పత్తి రైతుల బ్యాంకు ఖాతాలో సొమ్ము జమ చేయడం కోసం సదరు రైతు బ్యాంకు ఖాతాకు ఆధార్ కార్డు అనుసంధానం చేయడం తప్పనిసరని చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి తెలిపాటు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ద్వారా జిల్లాలో పత్తి కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుందని, చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ కేవలం విక్రయ రసీదు జారీ చేస్తుందని పేర్కొన్నారు. పత్తికి సంబంధించి ఆదిలాబాద్ శాఖ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు నేరుగా చెల్లింపులు చేయబడతాయని అన్నారు. ఇందులో ఆధార్ అనుసంధానిత బ్యాంకు ఖాతాకు మాత్రమే చెల్లింపులు జరుగుతాయని, ఈ నేపథ్యంలో రైతుల ఖాతాలకు వారి ఆధార్ అనుసంధానం తప్పనిసరిగా ఉండాలనీ తెలిపారు. రైతు బ్యాంకు ఖాత సక్రమంగా లేని రైతులకు సంబంధించిన సొమ్ము తిరిగి సీసీఐ ఖాతాకు వెళ్తుంతుందని తెలిపారు. రైతులు ఆధార్ సెంటర్ ను సందర్శించి ఆధార్ ప్రామాణికతను ధృవీకరించుకోవాలని, తమ బ్యాంకు ఖాతాను ఆధార్ అనుసంధానమై ఉందో లేదో నిర్ధారించుకోవాలని అన్నారు. అవసరమైతే తమ బ్యాంకు అధికారులను సంప్రదించి క్రెడిట్ లిమిట్ పెంచుకోవాలని, ఈ చర్యలు తీసుకున్నట్లయితే పత్తి అమ్మకానికి సంబంధించి వారికి రావలసిన చెల్లింపులు సకాలంలో అందుతాయని, ఈ క్రమంలో రైతులు తమ బ్యాంకు ఖాతాలను సక్రమంగా చేసుకోవాలని సూచించారు.

సీసీ రోడ్డు పనులు ప్రారంభం

నవతెలంగాణ-జుక్కల్

ఎమ్మెల్యే తోట లక్ష్మి కాంతారావు ఆదేశాల మేరకు మండలంలోని గుండూరు తాండలో సిసి రోడ్ పనులను ఆదివారం గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. పల్లెలలో సిసి రోడ్లు వేయడం పల్లె ప్రగతికి నాంది పలికినట్టేనని తెలిపారు. గ్రామాలలో వీధులలో రోడ్లు లేక అవస్థలు పడుతున్నామని ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో వెంటనే నిధులు కేటాయించి గ్రామంలో సిసి రోడ్డు వేసేందుకు అనుమతి ఇవ్వాలని సంబంధిత అధికారులకు ఎమ్మెల్యే ఆదేశించారు. అనంతరం నిధులు మంజూరు చేసి వెనువెంటనే సీసీ రోడ్డు పనులను ప్రారంభించడం సంతోషకరమైన విషయమని గ్రామస్తులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుండూర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మారుతి పటేల్, మాజీ ఉప సర్పంచ్ ప్రకాష్ పటేల్, గనుపటేల్, సంజు పటేల్, సురేష్ పటేల్, ప్రసాద్, రమేష్, సోపాన్, నారాయణ, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షులుగా సిద్ధంశెట్టి రమణ

నవతెలంగాణ-కామారెడ్డి

ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం జిల్లా అధ్యక్షులుగా సిద్ధం శెట్టి రమణను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణంలోని గాంధీనగర్‌లో గల ఆర్యవైశ్య అభివృద్ధి సంఘంలో ఎన్నికల అధికారులు మోటూరి పురుషోత్తం, చాట్ల లింగం ఆధ్వర్యంలో ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం ఎన్నికలను నిర్వహించారు. అధ్యక్షులుగా సిద్ధంశెట్టి రమణ, ప్రధాన కార్యదర్శిగా నంగులూరి వెంకటేశం, కోశాధికారిగా శిల వెంకట రాజయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తమను రెండు సంవత్సరాలుగా ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం అధ్యక్ష ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు ఆర్యవైశ్య అభివృద్ధి సంఘం సభ్యులందరికీ ప్రత్యేక కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలిపారు. నిరుపేద ఆర్యవైశ్య సంఘం కుటుంబ సభ్యులకు తోడ్పాటు అందిస్తామన్నారు. కార్యక్రమంలో సభ్యులు సునీల్ కుబ్బ, వెంకట రాజం, తృప్తి అనిల్, కాముని సందీప్, కస్పా శ్రీనివాస్, పప్పుల సోమశేఖర్, ఆర్యవైశ్య అభివృద్ధి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

క్యాన్సర్ పేషెంట్లకు ఆర్థిక సాయం

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా కేంద్రంలో జరిగిన కామారెడ్డి ఆఫ్ మారథాన్ 21 కిలోమీటర్ల పరుగు పందెంలో మున్సిపల్ మాజీ కౌన్సిలర్ గెరిగంటి లక్ష్మీనారాయణ 45 వయసు కేటగిరీలో 5వ స్థానం సాధించారు. కాంపిటేషన్‌లో వచ్చిన ప్రైజ్‌మనీని రూ.5000 క్యాన్సర్ బారినపడ్డ చిన్న పిల్లలకు పద్మపణి సొసైటీ స్వచ్ఛంద సంస్థకు విరాళాన్ని అందించారు. కార్యక్రమంలో కామారెడ్డి జిల్లా అడిషనల్ ఎస్పీ చైతన్య రెడ్డి, పద్మ పానీసొసైటీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, డైరెక్టర్ స్వర్ణలత, విద్యాసంస్థల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాటు పూర్తి

నవతెలంగాణ-తాడ్వాయి

మండల కేంద్రంలోని ప్రభుత్వ గురుకుల బాలికల పాఠశాలలో ఈనెల ఐదో తేదీ నుంచి జరిగే ఇంటర్మీడియట్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపర్‌ండెంట్ బి.సురేఖ ఆదివారం తెలిపారు. గురుకుల పాఠశాలకు చెందిన 136 మంది విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన 161 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరిండెంట్ తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ

- జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్




విద్యార్థులతో కలిసి భోజనం చేస్తుతన్న అదనపు కలెక్టర్ మోతిలాల్

నవతెలంగాణ-జైపూర్

ప్రభుత్వం విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని జిల్లా అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల సాంఘిక సంక్షేమ బాలుర పాఠశాల, కళాశాల, వసతి గృహాన్ని సందర్శించి వంటశాల, భోజనం తయారీ విధానం, గదులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమంలో భాగంగా డైట్ చార్జీలను 40 శాతం, కాస్మోటిక్ చార్జీలను 200 శాతం పెంచిందని, నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించడంతో పాటు వారి ఆరోగ్యం పట్ల ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ద్వారా జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి పనులు చేపట్టి ప్రతి ప్రభుత్వ పాఠశాలలో త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు, ప్రహరి గోడ, అదనపు గదులు ఇతర అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారిస్తుందని, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. 10వ తరగతి వార్షిక పరీక్షలు సమీపిస్తున్నందున విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పరీక్షలలో ఉత్తమ ఫలితాల సాధించాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాల సాధన దిశగా పట్టుదలతో కషి చేయాలని తెలిపారు. విద్యార్థులతో కలిసి వసతి గృహంలో రాత్రి బస చేశారు.

గల్ఫ్ బాధిత కుటుంబాలకు నిధులు విడుదల పట్ల హర్షం



విలేకరులతో మాట్లాడుతున్న గల్ఫ్ కార్మిక సంఘం నాయకులు

నవతెలంగాణ-జన్నారం

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సమయంలో గల్ఫ్ కార్మికులకు ఇచ్చిన హామీ మేరకు, గల్ఫ్ దేశాల్లో డిసెంబర్ 2023 నాటి నుంచి మరణించిన తెలంగాణ కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించడం ఆ నిధులను విడుదల చేయడం అభినందనీయమని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు కల్లెడ భూమయ్య అన్నారు. ఆదివారం పత్రిక విలేకరులతో మాట్లాడుతూ మంచిర్యాల జిల్లాలోని ముగ్గురి కార్మికుల కుటుంబాలకు ఐదు లక్షల ఎక్స్‌గ్రేషియా విడుదలైనట్టు సమాచారం ఉండగా ఇంకా కొన్ని కుటుంబాలు మిగిలి ఉన్నాయన్నారు. వారికి కూడా తొందరగా ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలు ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం తెలంగాణలో ఎన్నో గల్ఫ్ కార్మికుల కుటుంబాలకు ఆసరా కల్పించనుందని అన్నారు. అలాగే డిసెంబర్ 2023 కన్నా ముందు చనిపోయిన కార్మికులకు, గల్ఫ్ నుంచి రిటన్ వచ్చి సంవత్సరం గడవకముందే చనిపోయిన కార్మికుల కుటుంబాలకు కూడా ఈ స్కీము వర్తింపజేయాలని ముఖ్యమంత్రిని వేడుకున్నారు. తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి తరపున ముఖ్యమంత్రికి హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు. గల్ఫ్ బోర్డు ఏర్పాటు చేసి దాని ద్వారా గల్ఫ్‌లో పని చేసే కార్మికులకు భద్రత, హక్కులు, సంక్షేమ పథకాలు అందించేలా ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. గల్ఫ్ కార్మికుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా మారాలని, ఈ విధమైన పథకాలు మరింత విస్తరించాలి అని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇన్‌చార్జి ఎరుకల రాజు గౌడ్, దుబాయ్ శాఖ అధ్యక్షుడు మహమ్మద్ అలీం, రాష్ట్ర కోశాధికారి అమరకొండ మల్లేష్ పాల్గొన్నారు.

క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డ్స్ పోస్టర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-మందమర్రి



క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 4న నిర్వహించనున్న క్రేజీ స్టార్ ఆఫ్ ది ఇయర్ అవార్డు 2025 పోస్టర్‌ను మందమర్రి ఎస్ఐ శివనీతి రాజశేఖర్ ఆదివారం పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ రంగాలలో సేవలందిస్తూ రాణిస్తున్న వారిని గుర్తించి అవార్డులను ఇవ్వడం అభినందనీయమని అన్నారు. అకాడమీ వ్యవస్థాపకులు అంతడుపుల నాగరాజు మాట్లాడుతూ క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ వార్షికోత్సవం పురస్కరించుకొని ఆయా రంగాల్లో రాణిస్తున్న ప్రతిభా మూర్తులకు అవార్డులని అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రధాన కార్యదర్శి ఉప్పులేటి నరేష్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అతిథులుగా ప్రజా కవులు దరువు ఎల్లన్న, తీన్మార్ రవి, మాట్ల తిరుపతి, పల్లె నరసింహ, బోగే అశోక్, యూట్యూబ్ స్టార్స్ సౌజన్య, అమూల్య, స్నేహ, రౌడీ హరీష్, పూజ, తదితరులు రానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు గాండ్ల సంజీవ్, ఉపాధ్యక్షుడు సకినాల శంకర్, క్రేజీ స్టార్స్ డాన్స్ అకాడమీ అధ్యక్షుడు పులిపాక శ్రీనివాస్, ప్రోగ్రాం ఆర్గనైజర్స్ అంతర్పుల మధు, కలువల శ్రీనివాస్, ఉప్పులేటి రాజమౌళి, ఎనగందుల రజినీకాంత్, సీనియర్ డాన్స్ మాస్టర్స్ రాకం సంతోష్, కొండపర్తి సది, సునార్కర్ రాంబాబు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-ఎల్లారెడ్డి (లింగంపేట్)

ఎల్లారెడ్డి మండలంలోని వెల్లుట్ల గ్రామానికి చెందినా బెగరి లక్ష్మీ శుక్రవారం ప్రమాదవశాత్తు హైదరాబాద్‌లో చనిపోయింది. విషయం తెలుసుకున్న కాంగ్రెస్ నాయకులు వెల్లుట్ల సంతోష్ కుమార్ ఆదివారం బెగరి లక్ష్మీ కుటుంబాన్ని పరామర్శించారు. మనోధైర్యం కల్పించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఆయనతో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఒట్లం భూమయ్య, నర్వ శంకర్, ప్రకాష్, దేవరాజ్, మసానిపేట్ చిన్న సాయిలు, మెంబర్ కాశీరాం, గౌతమ్, విట్టల్, రమేష్, శేఖర్, రమేష్, పోతురాజు సాయిలు, కొల్పుల కాశీరాం, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదు

- పీఆర్టీయూ జిల్లా అధ్యక్షులు కుశాల్

నవతెలంగాణ-లింగంపేట్

ప్రభుత్వ శాఖలో పనిచేసే ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పదని పిఆర్టియు టీఎస్ జిల్లా అధ్యక్షులు కుశాల్ అన్నారు. ఆదివారం మండల సమీపంలోని లింగంపల్లి గ్రామ సమీపంలో గల డిపిఎల్ ఫంక్షన్ హాల్‌లో లింగంపేట్ మండల కేంద్రంలోని ఉచ్చతర పాఠశాల ప్రధానోపాధ్యాయులు సూరయ్య ఉద్యోగ విరమణ చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ.. పాఠశాలను దేవాలయంగా మార్చిన గొప్ప ఉపాధ్యాయుడని కొనియాడారు. విధి నిర్వహణలో పలువురికి ఆదర్శంగా నిలిచారన్నారు. ఉపాధ్యాయ వృత్తికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. పలువురికి ఆదర్శంగా నిలిచారని ఆయనను అభినందించారు. శాలువా కప్పి పూలదండ వేసి ఘనంగా సన్మానించారు. ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దినత ఘనత ఆయనకే దక్కిందన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం ఆయన సేవలు యూనియన్‌కు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిఆర్టియు నాయకులు, మండల విద్యాధికారి షౌకత్ అలీ, పిఆర్టియు టీఎస్ మండలాధ్యక్షులు రవీందర్ శర్మ, శేషయ్య, దామోదర్, రాజయ్య, వేణుగోపాల్, శోభారాణి, మదన్మోహన్, అనిల్‌రెడ్డి, రజనీకాంత్, పరువయ్య, సాయన్న ఆయా మండలాలకు చెందిన పాఠశాలకు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ చైర్మన్ నుంచి టీచర్‌గా అంకు సంధ్య

నవతెలంగాణ-బోధన్

బోధన్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అంకు సంధ్యకు ప్రభుత్వ ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం వచ్చింది. దీంతో ఆమె ఏఎంసీ చైర్మెన్ నుంచి ఐదు రోజుల క్రితం తన చైర్‌పర్సన్ పదవికి రాజీనామా చేసి టీచర్ ఉద్యోగంలో చేరారు. గతంలో కోర్టులో పెండింగ్‌లో ఉన్న 2008 డీఎస్సీకి సంబంధించి ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో 140 మందిని ప్రభుత్వ ఉపాధ్యాయులుగా నియమించింది. ఇందులో ఏఎంసీ చైర్‌పర్సన్ అంకు సంధ్య ఒకరు. గత నెల 15న అంకు సంధ్యకు పోస్టింగ్ ఉత్తర్వులు వచ్చాయి. కామారెడ్డి జిల్లా డోంగ్లీ మండలం కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో ఆమెకు పోస్టింగ్ ఇచ్చారు. ఇటీవల పదవీకాలం ముగిసిన పాలకవర్గంలో కౌన్సిలర్‌గా ఐదేళ్లపాటు కొనసాగారు. అంతకముందు రెండు సార్లు ఆమె భర్త అంకు దామోదర్ (దాము) మున్సిపల్ కౌన్సిలర్‌గా పనిచేశారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలి

నవతెలంగాణ-తాడ్వాయి

విద్యార్థులు భయం వీడి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాయాలని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ సిహెచ్.శైలజ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థులకు పలు మెలుకువలు సూచించారు. ఏకాగ్రతతో ఉండి ఆత్మవిశ్వాసంతో పరీక్షలు రాస్తే అనుకున్న మార్కులు పొందుతారని అన్నారు. పరీక్ష సమయంలో భయాందోళనకు గురుకావొద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ బి.సురేఖ. ఉపాధ్యాయ బృందం విద్యార్థినిలు తదితరులు పాల్గొన్నారు.

కబ్జాకు గురవుతున్న పంచాయతీ స్థలం

నవతెలంగాణ-కామారెడ్డి

మాచారెడ్డి మండలంలోని గాజ్యా నాయక్ తండా అంగడి బజార్‌లోని గ్రామపంచాయతీ స్థలం రోజురోజుకూ కబ్జాకు గురవుతుందని మాజీ ఉప సర్పంచ్ తోకల కిషన్ తెలిపారు. అంగడి బజార్లో పర్మిషన్ వరకు ఇల్లు కట్టుకున్నారని, కానీ ఇంటి ముందు రోడ్డు వరకు రేకుల షెడ్డు వేసుకొని కబ్జా చేసుకుంటున్నారని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గ్రామ కార్యదర్శికి, గ్రామ ప్రత్యేక అధికారికి తెలిపినా పట్టించుకోవడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రేకుల షెడ్లు తీసేయని యెడల ప్రజావాణిలో ఫిర్యాదు చేయనున్నట్టు పేర్కొన్నారు.

ఘనంగా శ్రీపాదరావు జయంతి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ కార్యాలయంలో దుద్దిల్ల శ్రీపాదరావు జయంతి వేడుకలను ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ శ్రీపాదరావు 1935 మార్చి 2న జన్మించారని, 1984 ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున మంథని శాసనసభ నియోజకవర్గం నుంచి పోటీ చేసి విజయం సాధించారని, అలాగే శ్రీపాదరావు అన్ని పార్టీల మద్దతుతో స్పీకర్‌గా అసెంబ్లీని సమర్థవంతంగా నడిపించడంలో ముఖ్యపాత్ర పోషించారన్నారు. అతని జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని ఆయన సేవాభావం ప్రతి నాయకునికి ఆదర్శమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, శ్రీరాంపూర్ ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ టి శ్రీనివాస్, ఆర్కే-5, 6 గ్రూప్ ఏజెంట్ శ్రీధర్, సెక్యూరిటీ అధికారి జక్కరెడ్డి, డీవై పీఎం రాజేశ్వరరావు, ఆర్కే-5, 6 గ్రూప్ ఇంజనీర్ శ్రీనివాస భట్టాచార్య పాల్గొన్నారు.

ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి

నవతెలంగాణ-జన్నారం

ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలని ప్రముఖ వైద్యులు రవి శంకర్ సూచించారు. జన్ ఔషధీ దివస్ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో కేంద్ర ప్రభుత్వ జన్ ఔషధీ కేంద్రంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో పలువురికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అనిల్ యాదవ్, వంగపల్లి సురేశ్, దండవేణి శ్రీధర్, గోలి చందు, కొండగొర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన

- హాజరైన మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య



నవతెలంగాణ-కాసిపేట

మండలంలోని పల్లంగూడ గ్రామంలో ఆదివారం శ్రీ మహాగణపతి సుబ్రహ్మణ్యేశ్వర అష్టాంశ శ్రీ వరదాంజనేయ స్వామి ధ్వజ శిఖర దేవాలయ విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ఠాపన చేశారు. ఈ మహోత్సవానికి బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య హాజరై ప్రత్యేక పూజలు చేశారు. మాజీ సర్పంచ్ దుస్స చందు, ఆలయ కమిటీ, గ్రామస్తులు పాల్గొన్నారు.

భార్య మందలించిందని భర్త ఆత్మహత్య

నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

భార్య మందలించినందుకు భర్త పురుగు మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. టూ టౌన్ ఏఎస్సై ముకుంద్ వివరాల ప్రకారం మహారాష్ట్ర కిన్వాట్ తాలూకా దైహిలీకు చెందిన నూకల్వర్ ఓం ప్రకాశ్ (35) మద్యానికి బానిస అయ్యాడు. తరచుగా మద్యం సేవించేవాడు. ఈ క్రమంలోని భార్య ముగ్గురు పిల్లలు ఉన్నారు వాళ్ళ భవిష్యత్తు ఏమైపోతుందని మందలించగా శనివారం చేనులో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు రిమ్స్‌కు తీసుకురాగా పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు..

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా బోధించాలి

నవతెలంగాణ-బోధన్

తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చేలా ఇందూర్ హైస్కూల్‌లో విద్యాబోధన చేయడం గర్వకారణమని ఎంఈఓ నాగయ్య అన్నారు. శనివారం పట్టణంలో గల ఆచన్‌పల్లిలోని ఇందూర్ హైస్కూల్ వార్షికోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలో విద్యార్థుల అభిరుచికి అనుగుణంగా విద్యాబోధన జరగాలని సూచించారు. ఇందూర్ హైస్కూల్ విద్యార్థులు నాణ్యమైన విద్యను పొంది దేశవిదేశాలలో స్థిరపడడం అభినందనీయమన్నారు. ఇందూర్ విద్యాసంస్థల అధినేత కొడాలి కిశోర్ ఇతింతై వటుడింతై అన్న చందంగా ఎదిగారని భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు విద్యార్థులకు, ప్రేక్షకులకు అలరించాయి. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి వ్యవస్థాపకులు బసవేశ్వర రావు, ట్రస్మా నాయకులు మిద్దెలా రాజు, శ్రీనివాసరావు, హరికృష్ణ, సురేష్, రమణారెడ్డి, హెచ్ఎం రామారావు, స్వాతి, ధనలక్ష్మి, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

మద్నూర్‌కు చేరుకున్న కోళ్యాణ్ పాక్ రేణుక ఛార్యపాదయాత్ర

నవతెలంగాణ-మద్నూర్

మహారాష్ట్ర దేగ్లూర్ నుంచి ప్రారంభమైన కోళ్యాణ్ పాక్ రేణుక ఛార్యపాద యాత్ర ఆదివారం మధ్యాహ్నం మద్నూర్‌కు చేరుకుంది. మద్నూర్‌లో పెద్ద ఎత్తున స్వాములకు పూజ కార్యక్రమం ఘనంగా చేశారు. అనంతరం సంగాయప్ప స్వామి పాదయాత్ర భక్తులకు, స్వాములకు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. అనంతరం ఇక్కడి నుంచి బిచ్కుంద మండలంలోని కందర్‌పల్లికి పాదయాత్ర భక్తులు బయలుదేరారు. ఈ యాత్ర దాదాపు పది రోజులపాటు జరుగుతుందని, దెగ్లూరు నుంచి ప్రారంభమైన స్వాముల పాదయాత్ర గాంధార్ మండలానికి చేరుకుంటుందని వివరించారు.